www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 23 డిసెంబరు 2023

5

పశ్చిమ గోదావరి

సిఎం పర్యటన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్ భీమవరం పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి భీమవరం పర్యటన ఏర్పాట్లపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ లూథరన్ హైస్కూల్ హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంతానికి సుమారు మూడు కిలోమీటర్లు దూరం ఉంటుందని, ముఖ్యమంత్రి ప్రయాణించే బస్సు మార్గంలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యతివ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

పంట నష్టం @ 87 వేల ఎకరాలు

రెండు జిల్లాల్లో పంట నష్టం లెక్కలు తేలిపోయాయి. రైతులు 87 వేల ఎకరాల్లో పంటను కోల్పోయారు. వేలాది మంది రైతులు రోడ్డున పడిన పరిస్థితి. మిచౌంగ్ తుపాను దెబ్బకు కౌలురైతులు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వ ఆదేశాలతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. పంట కోల్పోయిన రైతుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న పాలకులకు కనికరం లేకుండా పోయింది.

రెండు జిల్లాల్లో తేలిన పంటనష్టం లెక్కలు

గ్రామ సచివాలయాల వద్ద జాబితాల ప్రదర్శన

'పశ్చిమ'లో 49,495 ఎకరాల్లో పంట వర్షార్పణం

ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

అనుకోని విపత్తుతో సర్వం కోల్పోయిన కౌలురైతులు

నష్టపరిహారం వాస్తవ సాగుదారునికి అందేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను విలయతాండవంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఏకంగా 87,431 ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయినట్లు లెక్క తేలింది. ఈ అంచనాలు కేవలం 33 శాతం నష్టం పైబడిన లెక్కలు మాత్రమే. ఇంకా నష్టపోయిన విస్తీర్ణం పెద్దఎత్తున ఉంది. రంగుమారిన ధాన్యం లెక్కలు ఇందులో లేవు. రంగుమారిన, తడి ధాన్యంతో రైతులకు ఎక్కడా మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. అవేమీ పంటనష్టపరిహారం లెక్కల్లో చేర్చలేదు. రెండు జిల్లాల అధికారులు తుపానుకు దెబ్బతిన్న ఖరీఫ్ పంట లెక్కలను తేల్చి గ్రామ సచివాలయాల వద్ద జాబితాలను ప్రదర్శించి అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. అభ్యంతరాలు పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నష్టం అంచనాలు నివేదించనున్నారు. అధికారులు తేల్చిన లెక్కల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లాలో వరి, మినుము, వేరుశెనగ పంటలకు సంబంధించి 49,495 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. దీనిలో ప్రముఖంగా వరిపంట 47,657 ఎకరాలు నష్టపోగా, మినుము 1,763 ఎకరాలు, వేరుశెనగ 75 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఏలూరు జిల్లాలో మొత్తం 37,936 ఎకరాల్లో పంటను రైతులు కోల్పోయారు. దీనిలో అత్యధికంగా వరి పంట 22,045 ఎకరాల్లో ఉండగా, మొక్కజొన్న 4,366.75 ఎకరాలు, మినుము 241.38 ఎకరాలు, పత్తి 2,181.67 ఎకరాలు, వేరుశెనగ 938.75 ఎకరాలు, పొగాకు 8,160 ఎకరాలు, చెరకు రెండెకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. రెండు జిల్లాల్లోనూ అత్యధికంగా 69,702 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది.

నిబంధనల పేరుతో జాబితాలో చేరని దెబ్బతిన్న పంట

అధికారులు తేల్చిన పంటల లెక్కలు కేవలం 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలకు సంబంధించినవి మాత్రమే. 20, 30 శాతం ఈవిధంగా నష్టపోయిన పంట ఇంకా వేలాది ఎకరాల్లో ఉంది. 40 బస్తాల దిగుబడి రావాల్సిన పొలాలు దిగుబడి చాలా తగ్గిపోయిన పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.35 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. అయినప్పటికీ 33 శాతంలోపు దెబ్బతిన్న పంట పొలాలను జాబితాలో చేర్చలేదు. దీంతో ఎంతోమంది రైతులు నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి 90 శాతం కౌలురైతులే ఉన్నారు. అయితే ప్రభుత్వం విధించిన నిబంధనలతో పది శాతం కౌలురైతుల పేర్లు కూడా నష్టపరిహారం జాబితాలోకి చేరలేదు. దీంతో ఆరుగాలం కష్టపడిన కౌలురైతులకు తీరని అన్యాయం జరిగింది. కౌలురైతులను ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుంటుందో చెప్పాలంటూ రైతుసంఘాలు కోరుతున్నాయి. కౌలురైతులకు న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న పంటలు

పంట వివరం	పంటనష్టం (ఎకరాల్లో)
వరి	47,657.50
మినుము	1,762.50
వేరుశెనగ	75
మొత్తం	49,495

ఏలూరు జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలు

పంట వివరం	పంటనష్టం (ఎకరాల్లో)
వరి	22,045.33
మొక్కజొన్న	4,366.77
మినుము	241.38
పత్తి	2,181.67
వేరుశెనగ	938.75
పొగాకు	8,160.25
చెరకు	2
మొత్తం	37,936

ఉండిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. ఈ మేరకు శుక్రవారం అంగన్‌వాడీలు రాస్తారోకో, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల గడ్డి తింటూ, చెవుల్లో పూల పెట్టుకుని నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆపేదేలేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. - 6లో

భీమవరం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

బిజెపి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పార్లమెంట్‌పై జరిగిన దాడి ఘటనను, అసాంఘిక శక్తుల ప్రమేయాన్ని భద్రతా వైఫల్యాలను, లోపాలను ప్రశ్నించిన ఎంపిలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడం పార్లమెంట్ చరిత్రలోనే చీకటి అధ్యాయమని, సస్పెండ్ చేయాల్సింది నిలదీసిన ఎంపీలను కాదని మోడీ, అమిత్ షాలను, ఘటనకు బాధ్యులను అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి విమర్శించారు. అప్రజాస్వామికంగా పార్లమెంటు ఉభయ సభల్లో 146 మంది ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఇండియా వేదిక దేశవ్యాప్త పిలుపులో భాగంగా భీమవరం కొత్త బస్టాండ్ వద్ద వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమని విమర్శించారు. ఘటనకు పాల్పడిన వారికి పాస్‌లు ఇచ్చిన బిజెపి ఎంపీపై చర్యల్లేవని, మొత్తం దాడికి మోడీ, అమిత్ షా లు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ మోడీ పాలనలో నియంతృత్వం పెరిగిపోయిందని, చట్టమంటే వారికి గౌరవంలేదని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, బిజెపిని సాగనంపాలని డిమాండ్ చేశారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ పార్లమెంటులో జరిగిన దాడి బిజెపి కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వైవి.ఆనంద్, సిపిఎం నాయకులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తణుకులో నిరసన

తణుకు రూరల్: ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వం గద్దె దిగాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ అన్నారు. స్థానిక నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. పార్లమెంట్‌లో భద్రత ఎలా ఉందో కళ్లకు కనబడిందన్నారు. పార్లమెంట్ సభ్యులకు రక్షణ లేకపోతే, ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నామన వెంకటేశ్వరరావు, పి.అమ్మిరాజు, గార.రంగారావు, కామన మునిస్వామి, సిహెచ్.రామకృష్ణ, బొద్దాని మురళీకష్ణ, కడలి రామారావు, పట్టణ అధ్యక్షుడు ఆకుల సాయి, గౌస్ ఖాన్, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : లోకసభను కాపాడలేని బిజెపి ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్నిడి బాబ్జి తెలిపారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నలుపురంగు దుస్తులు ధరించి, నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని విమర్శించారు. లోకసభలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు పొగబాంబులు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా ప్రతి పక్షాలు ఇండియా కూటమి నిరసనలు, ఆందోళనలు, ధర్నా కార్యక్రమాలు చేపట్టి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, మేట్రెడ్డి రమణ, చిటికిన రాము పాల్గొన్నారు.

ఆచంట : మోడీ పాలనలో దేశ ప్రజలకే కాదు ప్రజాప్రతిని కూడా భద్రత కరువైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట మార్కెట్లో బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం గోపాలన్ మాట్లాడారు. దేశ పార్లమెంటు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 146 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసి మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై దేశ ప్రజలంతా ఐఖ్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

పెనుగొండ : బిజెపి విధానాలను నిరసిస్తూ స్థానిక గోంగూర తూము సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, ఆవుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు : ఇండియా వేదిక దేశవ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడారు. ఈ నెల 13వ తేదీ దేశానికి చీకటి రోజు అని తెలిపారు. దేశంలో రాక్షస పరిపాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, తేతల నాగిరెడ్డి, కరక వెంకట్రావు, కృష్ణ, బండారు శ్రీనివాసరావు, కె.నాగరాజు, మోర్చ రాజేష్, గిద్ద శ్రీను, అడపా ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

భీమవరం రూరల్: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల (ఎస్ఎస్ఎ) సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె శుక్రవారం మూడోరోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రం భీమవరం కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో విస్సాకోడేరు వంతెన వద్ద జరుగుతున్న సమ్మెలో వాసుదేవరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు బావాజీ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, శ్రీనివాస్, సమగ్ర శిక్ష అభియాన్ యూనియన్ నాయకులు పిటి మాస్టర్ రాజేంద్ర, సిఆర్‌పి స్పందన పాల్గొన్నారు.

ఉద్యమవీరులకు మరణం లేదు

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - గణపవరం

ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి వేగుచుక్క ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అని, ఉద్యమవీరులకు మరణం లేదని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి అన్నారు. శుక్రవారం పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాబ్జీ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. సభకు మండల కమిటీ అధ్యక్షులు జె.నాని అధ్యక్షత వహించారు. గోపీమూర్తి మాట్లాడుతూ సాబ్జీ మరణంతో ఉద్యమాల గొంతుమూగబోయిందన్నారు. ఆయన ఆశయ సాధనకు యుటిఎఫ్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎంఇఒ పుచ్చల శేషు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు వి.ఆంజ నేయులు, మండల ప్రధాన కార్యదర్శి జి.భవానీప్రసాద్, మండల నాయకులు ఎం.పెద్దిరాజు, కె.హరిదుర్గాప్రసాద్ పాల్గొన్నారు. తొలుత సాబ్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయండి

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తీరు మారకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

నేడు ఎపి కల్లుగీత కార్మిక సంఘం 31వ జిల్లా మహాసభ

నేటికీ లక్షలాది మంది గీత కార్మికులు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. ఒకవైపు గీత వృత్తి ప్రమాదకరంగా ఉన్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోయినా కుటుంబ పోషణ కోసం వృత్తిని కొనసాగిస్తున్నారు. తరాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారుగాని గీతన్నల రాతలు మార్చే పాలకులు రావడం లేదు. వృత్తికి గ్యారంటీ లేదు. జీవితాలకు భద్రత లేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర సందర్భంగా 'మోకు భుజాన వేసుకుని.. నేను ఉన్నాను, నేను విన్నాను' అని గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కిస్తీలు రద్దు చేసి తాటి చెట్లపై హక్కు లేకుండా చేసి వృత్తిని దారుణంగా దెబ్బతీశారు.

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పోరాటం వల్ల వేలం పాటలు రద్దు, గీచే వారందరికీ సభ్యత్వం, గుర్తింపు కార్డులు, గీచే వారికే చెట్టుపై హక్కు, ఎక్స్‌గ్రేషియా, గుడి, బడి, చర్చి తప్ప ఎక్కడైనా కల్లు అమ్ముకునే హక్కు, ప్రతి సొసైటీలో చెట్లు పెంచుకునేందుకు ఐదెకరాల భూమి ఇవ్వాలని జిఒ 560, ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు ఉచితంగా గీసుకునే హక్కు, 50 సంవత్సరాలు పైబడిన గీత కార్మికులకు పింఛను ఇవ్వాలని జిఒ 350, తాటి, ఈత చెట్లు నరికిన వారికి రూ.వెయ్యి జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధించేలా జిఒ, తదితర హక్కులు నాడు సాధించుకున్నాం. అంతేకాదు ప్రభుత్వానికి, కల్లుగీత కార్మికులకు మధ్య వారధిలా పని చేయడానికి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి 1991లో పోరాడి సాధించుకున్న కల్లుగీత కార్పొరేషన్‌ను వైసిపి ప్రభుత్వం మూసేసింది. హర్యానా, కర్ణాటక, తెలంగాణ, ఒడిశ్శా, గోవా, యానాం తదితర రాష్ట్రాల నుండి అక్రమ మద్యం వరదలా మన రాష్ట్రానికి వస్తుంటే అరికట్టలేకపోతున్నారు. ఎనీటైమ్ విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్మించి కల్లు అమ్మకాలు దెబ్బతీస్తున్నారు.

2020 లాక్‌డౌన్ సమయంలో మనపక్క రాష్ట్రాలు కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు కల్లుపై ఏవిధమైన ఆంక్షలూ విధించలేదు. ఆ రాష్ట్రాల్లో గీత కార్మికులు స్వేచ్ఛగా కల్లు అమ్ముకున్నారు. మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కల్లుగీత కార్మికులపై కక్షగట్టి, కల్లుపై ఆంక్షలు విధించి 40 రోజులు కల్లు గీయనీయలేదు. ఎక్సైజ్ అధికారులు దౌర్జన్యంగా గీత కార్మికులపై బైండోవర్ కేసులు పెట్టారు. తాటిచెట్లకు ఉన్న కల్లు కుండలను రాళ్లతో పగలగొట్టారు. వైసిపి ప్రభుత్వం ఉపాధి పోయి కష్టాల్లో ఉన్న గీత కార్మికులను ఆదుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేయడంతోపాటు ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ద్వారా మంత్రులు, అధికారులతో చర్చించాం.

అన్నదమ్ముల్లా కలిసి ఉన్న గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత కులాల గీత కార్మికులను వైసిపి ప్రభుత్వం చీల్చేసింది. కులాల కార్పొరేషన్లు పెట్టి వైసిపి కార్యకర్తలు కొందరికి పదవులు ఇచ్చారు. కులాల కార్పొరేషన్ పెట్టి గీత కార్మికుల కొంపలు ముంచారే తప్ప వారికి ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వం మాత్రం కార్పొరేషన్లు తాకట్టు పెట్టి వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చుకుంది. ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి 14 నెలలైనా అతీగతీ లేదు. వందల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇస్తారో.. లేదో తెలియదు. కిస్తీలు రద్దు చేసి తాటిచెట్లపై హక్కు లేకుండా ఈ ప్రభుత్వం చేసింది. గీత కార్మికులను ఈ ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూస్తోంది. కార్పొరేషన్లకు, గీత కార్మికుల సంక్షేమానికి ఏమాత్రం నిధులు కేటాయించలేదు.

గీత కార్మిక కుటుంబాల పట్ల వైసిపి ప్రభుత్వ వైఖరి ఏమిటీ, ఈ నాలుగున్నర సంవత్సరాల్లో గీత కార్మికుల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల వృత్తిలో బతకలేక నగరాలకు, విదేశాలకు ఇతర పనులకు వలసలు పోతున్నారు. ఇదేనా గీత కార్మిక కుటుంబాలకు వైసిపి ప్రభుత్వం ఇచ్చే బహుమతి.. అందుకే మనకు తీరని అన్యాయం చేసిన వారికి మన సత్తా ఏమిటో చూపిద్దాం.

కల్లు కుండేమో కన్నీరు పెడుతుంది.. ఊరువాడ మద్యం మాత్రం వరదలా పారుతోంది.. గీతన్నల బతుకులు బజారుపాల్జేస్తోంది. ఆంధ్ర కల్పవృక్షంగా పేరొందిన తాటిచెట్లు రియల్ ఎస్టేట్ దెబ్బకు నేలకొరుగుతున్నాయి.

కల్లుపై కక్షగట్టిన సర్కారుపై ఐక్యంగా పోరాడదాం.. వృత్తిని కాపాడుకుందాం

- జుత్తిగ నరసింహమూర్తి
ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కల్లుగీత కార్మికుల ప్రధాన డిమాండ్లు

1. 2024-25 బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.30 కోట్లు కేటాయించాలి.
2. తాటిచెట్టుకు రూ.5 చొప్పున పన్ను (కిస్తీలు) కట్టించుకుని చెట్టుపై హక్కు కల్పించాలి.
3. వృత్తిలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి. సేఫ్టీ (రక్షణ) మోకులు ఇవ్వాలి.
4. ప్రతి గీత కార్మికునికీ బీమా అమలు చేయాలి. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి.
5. అర్హులైన గీత కార్మికులందరికీ సభ్యత్వం, గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలి.
6. వృత్తిలో ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. చనిపోయిన పిల్లలకు విద్య, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
7. బెల్టు షాపులు, అక్రమ మద్యం తక్షణం అరికట్టాలి. వారానికి రెండు రోజులు లిక్కర్ డ్రై డేలుగా ప్రకటించాలి.
8. కల్లు సొసైటీలకు 40 శాతం మద్యం షాపులివ్వాలి.
9. ప్రతి సొసైటీకీ చెట్లు పెంచడానికి జిఒ 560 ప్రకారం ఐదెకరాల భూమి ఇవ్వాలి.
10. గీత కార్మికులందరికీ ద్విచక్ర మోటారు వాహనాలు ఉచితంగా ఇవ్వాలి.
11. గీతన్న బంధు ప్రకటించి ప్రతి గీత కార్మిక కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి.
12. తాటి, ఈత చెట్లను నరికిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
13. పింఛను రూ.5 వేలకు పెంచాలి. ఎలాంటి షరతులూ విధించరాదు.
14. 1991లో పోరాడి సాధించుకున్న కల్లుగీత కార్పొరేషన్‌ను యధావిధిగా పని చేయించాలి. కార్పొరేషన్ ప్రభుత్వానికి, కల్లుగీత కార్మికుల మధ్య వారధిలా పని చేయాలి. వృత్తిలో చనిపోయిన వారి కుటుంబానికి తక్షణ దహన సంస్కారాలకు రూ.30 వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.20 వేలు కార్పొరేషన్ నుండి తక్షణమే ఇవ్వాలి.
15. కల్లులోని పోషకాలను, ఔషధ గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
16. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మించాలి.
17. సొసైటీల నిర్వహణపై అధ్యక్షులకు, సభ్యులకు అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి చైతన్య సభలు పెట్టాలి.
18. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలి.
19. పేద గీత కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
20. కేరళ మాదిరిగా కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించి ఉపాధికి గ్యారంటీ ఇవ్వాలి. కల్లుగీత సహకార సంఘాలను పటిష్టపర్చాలి.

పవన్ కళ్యాణ్‌కు జోగయ్య లేఖ

పాలకొల్లు: బడుగు బలహీన వర్గాలకు దారి చూపిస్తారని, నీతివంతమైన పరిపాలన అందిస్తారని ఆశిస్తున్న ప్రజానీకానికి మీ సమాధానం ఏంటని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాశారు. చంద్రబాబే కాబోయే సిఎం అని, ఈ నిర్ణయంలో రెండో మాట లేదని, అనుభవస్తుని నాయకత్వమే రాష్ట్రానికి కావాలని పవన్‌కళ్యాణ్ కూడా అనేక సార్లు ప్రకటించారని తెలిపారు. లోకేష్ ఆశిస్తునట్లు చంద్రబాబునే పూర్తి కాలం సిఎం చేయడానికి ఆమోదం ఉందా అని జోగయ్య రాశారు. మీరే ముఖ్యమంత్రి కావాలని, అధికారం చేపట్టడం ద్వారా బడుగు బలహీన వర్గాలు యాచించే స్థితి నుంచి శాసించే స్థితికి రావాలని కలలుకంటున్న జన సైనికుల కలలు ఏం కావాల నుకుంటున్నారని జోగయ్య ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన వాటి నుండి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండే రెండు కులాల నాయకులు రాజ్యమేలుతున్నారని, 80 శాతం జనాభా ఉన్న బడుగు, బలహీన వర్గాలకు మోక్షమెప్పుడు? అని తెలిపారు. ఈ ప్రశ్నలన్నింటికి మీ నుండి జన సైనికులకు సంతృప్తికరమైన సమాధానాలను ఆశిస్తూ రాజ్యాధికారాన్ని చేబట్టే విషయంలో మీ వైఖరి ఏంటో జన సైనికులందరికీ అర్థమయ్యేటట్లు చెప్పాలని జోగయ్య లేఖలో రాశారు. లేఖ వివరాలను జోగయ్య శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు.

వెంకటరత్నంకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి


వెంకటరత్నంను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం సీనియర్ నేత మండలంలోని దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కొల్లా వెంకటరత్నం సతీమణి తులసమ్మ (78) వృద్ధాప్య సమస్యతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఆమెకు భర్త వెంకటరత్నంతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తులసమ్మ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం వెంకటరత్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తులసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితో పాటు పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం జిల్లా నాయకులు భాతిరెడ్డి జార్జి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐగా కిరణ్ ఎంపిక

ప్రజాశక్తి - మొగల్తూరు


కిరణ్

ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కొల్లాటి కిరణ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. కిరణ్ తండ్రి రాధాకృష్ణ రైతు, తల్లి గృహిణి. కిరణ్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఎస్ఐగా ఎంపికైన కిరణ్‌ను సర్పంచ్ కోపనాతి పల్లయ్య, గ్రామస్తులు అభినందించారు.

నాట్లు త్వరగా పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

రైతులు త్వరితగతిన డిసెంబర్ నెలాఖరునాటికి నాట్లు పూర్తి చేసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం కిసాన్ మేళా, సందర్శన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అధ్యక్షత వహించారు. తణుకు ఎడిఎ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలంగ డాక్టర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడారు. జిల్లాలోని రైతులు వీలైనంత వరకు ఈ నెలాఖరునాటికి నాట్లు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సెలవు దరఖాస్తు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అత్తిలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండల కోశాధికారి వి.దుర్గబాబు ఆర్థిక సహాయంతో మండల ఉపాధ్యాయులకు సెలవు దరఖాస్తు పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కొమ్మర ఉన్నత పాఠశాలలో ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.దనసూరాజు సమక్షంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.గోపీమూర్తి చేతులమీదుగా అందించారు. విరాళం ఇచ్చిన మండల కోశాధికారి దుర్గబాబును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బేరర్లు శ్రీనివాసరావు, స్వామి, అప్పలరాజు, దుర్గబాబు, రాధాకృష్ణ, రాజేష్, వెంకటరావు, రమేష్ పాల్గొన్నారు.

'వైసిపి నేతల్లో ఓటమి భయం'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువగళం నవశకం ఎన్నికల శంఖారావ మహాసభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలయిక చూసిన వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, వారిని ఓటమి భయం వెంటాడుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి విమర్శించారు. ఆమె కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నారా లోకేష్ రాష్ట్ర యువత ప్రయోజనాల భవిష్యత్తు కోసం ప్రధాన లక్ష్యంగా ప్రారంభించిన యువగళం పాదయాత్ర జగన్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజాగళంగా మారిందన్నారు.

'పేదలను మోసగిస్తున్న బాబు, పవన్'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో పేదలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎంపిసి మాజీ ఛైర్మన్, వైసిపి మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు విమర్శించారు. మండలంలోని కొత్త పూసలమర్రులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపూసలమర్రు నుంచి కొంతమంది టిడిపి నాయకులు జనసేన పార్టీలో చేరితే, వైసిపి నాయకులు జనసేనలో చేరారని జనసేన నాయకులు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైసిపికి ప్రజల ఆదరణ పుష్కలంగా ఉన్నాయన్నారు.

గ్యాస్ గోడౌన్‌ను తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉండిలో యానాదుల కాలనీలో జనావాసాల మధ్య ఉన్న శంకరొసాయి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌ను తొలగించి వేరే ప్రాంతానికి మార్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ప్రాణాంతకంగా మారిన గ్యాస్ గోడౌన్ గురించి అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. ఎస్‌టిటి రక్షణ కల్పించి గ్యాస్ కంపెనీ యజమానులపై చర్య తీసుకుని తక్షణమే గ్యాస్ కంపెనీ గోడౌన్ మార్పు చేయించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎడిఐ శ్రీనివాస్‌కు, పోలీస్‌స్టేషన్‌లో, గ్రామ పంచాయతీ కార్యదర్శికి, పంచాయతీ అధ్యక్షులకు వినతిపత్రాలు అందించారు.

'దళితులను చిన్నచూపు చూస్తున్న జగన్'

ప్రజాశక్తి - పాలకొల్లు

దళితులను సిఎం జగన్ చిన్నచూపు చూస్తున్నారని రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తులా రామలింగేశ్వరరావు అన్నారు. స్థానిక 21, 31వ వార్డుల్లో టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో వైసిపి ప్రభుత్వంలో దళితులకు రద్దయిన 27 సంక్షేమ పథకాల, ఎస్‌సి సబ్ ప్లాన్ నిర్వీర్యం పలు విషయాల గురించి తెలియజేస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళిత ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ఎస్‌సి సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అగ్రిటెక్స్ ఇన్ అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఐసిఎఎఐ-2023) పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభించారు. తాడేపల్లిగూడెం ఎపి నిట్ సిఎస్ఇ హెడ్ డాక్టర్ కె.హిమబిందు జ్యోతి ప్రజ్వలనతో సదస్సు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐఐటి ఖరగ్‌పూర్ సిఎస్ఇ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.బట్టచార్య హాజరయ్యారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ఈ అవకాశాన్ని అన్ని రంగాల యువకులు, క్రీడా అభిమానులు వినియోగించుకోవాలని భీమవరం ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వివరాలు వెల్లడించారు. కోకో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడలు ఉంటాయన్నారు. ఈ క్రీడల్లో 15 ఏళ్లు దాటినవారు పాల్గొనవచ్చన్నారు. గెలుపొందినవారికి ఆకర్షణీయమైన బహుమతులు ఉన్నాయన్నారు. ఈ క్రీడలు ఉన్నతాధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులు, పిఇటి ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నవ వధువు మృతిపై పలు అనుమానాలు

ప్రజాశక్తి - పెనుగొండ

రెండు రోజుల క్రితం మృతి చెందిన నవ వధువు సత్యవాణి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతురాలి బంధువులు చెబుతున్నారు. ఆమె భర్త శివరామకృష్ణ సినిమాకని చెప్పి తీసుకెళ్లి ఘాతుకానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతురాలి చెవుల నుంచి రక్తం కారుతుందని, బంగారు ఆభరణాలు లేవని ఎస్ఐ రమేష్ తెలిపారు. మృతురాలి భర్త శివరామకృష్ణపై ఐపిసి సెక్షన్ 306 కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదు

11వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 11వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించేవరకూ ఉద్యమం ఆగదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మూడు రోజుల క్రితం తర్వాత జీతాలు పెంచుతున్నా నా మాటలు సిగ్గుచేటని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు అన్నారు భీమవరం శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో 11వ రోజు సమ్మె కొనసాగింది. సమ్మె శిబిరం వద్ద నుండి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో రాస్తారోకో చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో గణేష్, శాంతి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దుర్గ, మేరీగ్రేస్, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ సావిత్రి పాల్గొన్నారు.

పాలకోడేరులో...

పాలకోడేరు : సమ్మె శిబిరం వద్ద నుంచి ర్యాలీగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. సమ్మెకు ఎస్‌ఎఫ్‌ఐ సంఘం సంపూర్ణ మద్దతు పలుకుతుందన్నారు.

పాలకొల్లు : శుక్రవారం 11వ రోజు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మె ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, ఎం.ఏనసమ్మ, సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పురుషోత్తం, చల్లా సోమేశ్వర రావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కాళ్ల : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆకివీడు ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు యడవల్లి చంద్రావతి, రూన్సీ లక్ష్మీబాయి, కమల, రామమణి, రూన్సీ, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండి : ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు గడ్డి తింటూ తహశీల్దార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు.

ఆచంట : ఆచంట కచేరీ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా ఆచంట కచేరీ సెంటర్లో సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, అంగన్‌వాడీలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, మహేశ్వరి, బి.కమల, సత్యవతి, గౌరీశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మె చేపట్టి పదకొండు రోజులైనా ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాకపోవడం ఆశ్చర్యంగా ఉందని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు స్వరూపారాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు, ఐద్వా నాయకురాలు పి.జయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం మండల సెక్టార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె కొనసాగింది. సమ్మెకు సిఐటియు పట్టణ, మండల కమిటీ, ఐద్వా మండల కమిటీ సంఘీభావం తెలిపింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుండి పోలీసు ఐల్యాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు, అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

యలమంచిలిలో...

యలమంచిలి : అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. స్థానిక సెంటర్ వద్ద వందలాది మంది అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, మేడపాడు, దొడ్డిపట్ల సెక్టార్ల లీడర్లు రజని, దేవి, పద్మశ్రీ పాల్గొన్నారు.

పోడూరు: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. బస్టాండ్ సెంటర్ వద్ద వందల మంది అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పిల్లి.ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి రత్నరాజు, పాలవలస తులసీరావు, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి పాల్గొన్నారు.

గణపవరంలో...

గణపవరం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు 11వ రోజు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు, అంగన్‌వాడీ మండల నాయకులు బి.రామకోటి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు కెవి.మహాలక్ష్మి, ఎ.కళ్యాణి, సిహెచ్.మహాలక్ష్మి వికె.జయలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అత్తిలి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అంబేద్కర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి ధర్మేంద్ర, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

మొగల్తూరు : దీక్షా శిబిరాన్ని అంగన్‌వాడీ సంఘం జిల్లా కార్యదర్శి డి.కల్యాణి సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శనగా వెళ్లి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాణి, జిల్లా కమిటీ సభ్యులు జె.ఉమాదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, నాయకులు యడ్ల చిట్టిబాబు, ఆదూరి సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గడ్డి తిని నిరసన తెలిపారు. పెనుమంట్ర నుంచి బ్రాహ్మణ చెరువు వరకు ర్యాలీ, రాస్తారాకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటి యు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్ మాట్లాడారు.

ఆకివీడు : స్థానిక జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అంగన్‌వాడీలు గడ్డి తింటూ రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీల జిల్లా సహాయ కార్యదర్శి హసీనా నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గ, వాణి, లక్ష్మి, రమాకుమారి, రామలక్ష్మి, కనకదుర్గ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఇరగవరం : అంగన్‌వాడీలు పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి మాట్లాడారు. డిఒసి నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు జి.గోపీ, వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. టిడిపి నాయకులు అండన్‌వాడీలకు ఆహారం అందించి మద్దతు తెలిపారు.

నరసాపురం టౌన్ : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కల్యాణి దీక్ష శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడారు.

పెనుగొండ : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సంఘం మండల కార్యదర్శి కె.తులసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగిశెట్టి గంగారావు, ఎల్.ఉషశ్రీ, నాగలక్ష్మి, సుబ్బమ్మ, ఉందుర్తి దుర్గ పాల్గొన్నారు.

సమస్యల వెలికితీతలో ప్రజాశక్తి కృషి అభినందనీయం

క్యాలెండర్ ఆవిష్కరణలో కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్ సురేష్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజాశక్తి 2024 క్యాలెండర్ వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా ఉందని కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ మాధు సురేష్ అన్నారు. మండలంలోని కాళ్లకూరు సొసైటీలో ప్రజాశక్తి దినపత్రిక 2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా ప్రజాశక్తి పత్రిక నిలుస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన బడుగు బలహీన మైనార్టీల ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సిఇఒ యిబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల మన్ననలు పొందుతుందని ప్రజాశక్తి ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు అన్నారు. సొసైటీ ఛైర్మన్ మాధు సురేష్, సిఇఒ యిబ్బా శ్రీనివాస్, త్రి సభ్య కమిటీ సభ్యులు అంగర సద్గుణరావు (యేసుబాబు), పచ్చిగోళ్ల సవితవెంకట రమణరావు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి నారాయణరాజు, డివిజనల్ ఇన్‌ఛార్జి గుండా సాయికుమార్ చేతులమీదగా ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కాళ్ల మండలం నుంచి సింగిల్ క్యాలెండర్ తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పి.రామకృష్ణంరాజు, వేగేశ్న ప్రకాష్‌వర్మ, వేగేశ్న సత్యనారాయణరాజు, సిహెచ్‌వి.రామకృష్ణ, ఎస్.త్రిమూర్తులు, జి.అప్పారావు, సిహెచ్.నాగప్రసాద్, యు.శ్రీనివాసరావు, జె.లక్ష్మి, కాళ్ల విలేకరి గొట్టేటి శ్రీనివాసులు, భీమవరం సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి టి.పెద్దిరాజు పాల్గొన్నారు.

సొసైటీలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

ఆడుదాం ఆంధ్రా విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆడుదాం ఆంధ్రా, రీ సర్వే పలు అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

నరసాపురం టౌన్ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 2024 క్యాలెండర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహిళల స్థితిగతులపై క్యాలెండర్ వేస్తున్నామన్నారు. సహాయ సహకారాలు అందిస్తున్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, బంకుర యశోద, బాసిన శ్యామల, సందక ఉదయకుమారి, డి.లక్ష్మి, బి.సుగుణ, ఎం.సరోజినీ పాల్గొన్నారు.

నంది నాటకోత్సవాల న్యాయ నిర్ణేతగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు గుంటూరులో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలకు న్యాయ నిర్ణేతగా పాలకొల్లు కళా పరిషత్ వ్యవస్థాపకులు మానాపురం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఎపి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ తమ్మా విజయకుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఛైర్మన్ పోసాని మురళి, పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, గౌరవ అధ్యక్షులు మేడికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, విరాకుల వెంకటరమణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, కోశాధికారి కొణిజేటి గుప్త, నడపన శ్రీనివాసరావు, సోమంచి శ్రీనివాస శాస్త్రి, కొల్లి ప్రసాద్, అంగర కుమార్, జిఎస్‌ఎన్.రవి అభినందించారు.

పేదల ఆరోగ్యానికి భరోసాగా ఆరోగ్యశ్రీ

నరసాపురం టౌన్ : పేదల ఆరోగ్యానికి భరోసాగా ఆరోగ్యశ్రీ నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం సచివాలయం-1 వద్ద నిర్వహించిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అర్హులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

పోడూరు : విఆర్ఎలకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బెల్లాని ప్రకాశరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సేవకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. సిఐటియు నాయకులు పిల్లిప్రసాద్ మాట్లాడారు.

ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ, జూనియర్ కాలేజీ డైరెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.

మొగల్తూరు : మండల కేంద్రంలోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు జాన్‌బాబు, ఎన్‌వివి.సత్యనారాయణ, ఎస్.ఉషా మాధవి పాల్గొన్నారు.

ఉండి : శ్రీనివాస రామానుజన్ అద్భుతమైన భారతీయ గణిత శాస్త్రవేత్త, గణిత మేధావి అని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్, డైరెక్టర్స్ ఖండాపు శ్రీనివాసరావు, నాగమణి అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఉండి శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన గణిత సంబంధమైన అనేక మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శన పూర్వకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శశి స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని కొమ్మర పాఠశాలలో వ్యాసరచన, క్విజ్, గణిత ఉపకరణాలు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు కెటి.సుందర్‌కుమార్ తెలిపారు. గణిత ఉపకరణాలపై ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.లీలాగోపాల్, ఎల్.ప్రసాదరావు, పి,సౌజన్య, శ్రీదేవి పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, స్టడీ ప్రాజెక్ట్ పోటీలు నిర్వహించిన ప్రశంసాపత్రాలు అందించారు.

కాళ్ల : మండలంలోని సీసలిలో మండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోల గణిత దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వి.రమణ హాజర య్యారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీకి నివాళులర్పించారు. ఆయన చేసిన కషిని కొనియా డారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

పెనుగొండ : ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో గణిత శాస్త్రజ్ఞుడు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వైవివి.అప్పారావు మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు శశి విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శశి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఇస్మాయిల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్ 2023-24లో పురుషుల విభాగంలో కబడ్డీ పోటీలో, పురుషుల షాట్‌పుట్ విభాగంలో,47ఐ100 రిలే పరుగులో మహిళల విభాగంలో పతకాలు సాధించారు. కబడ్డీ, షాట్‌పుట్ క్రీడాకారులు వచ్చే నెల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు అనంతపురం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్, స్పోర్ట్స్ మీట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన అభ్యసన పుస్తకాలను వాకర్స్ క్లబ్ తరపున విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడారు.

స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ

నరసాపురం టౌన్ : తాడేపలి గూడెం పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించిన అంతర పాలిటెక్నిక్ కళాశాల క్రీడల్లో సీతారాంపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థులు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ విద్యార్థులు జనవరి 4, 5, 6 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఆస్తి వేలం

పశ్చిమగోదావరి జిల్లా అఫిషియల్ రిశీవరు గారి వల్ల జరుపబడు స్థిరాస్తి వేలం యిస్తిహారు, పశ్చిమగోదావరి జిల్లా అఫిషియల్ రిశీవరు గారి ఆఫీసులో

ఓ.ఆర్.ఐ.నెం.పి.1/2023

ఇన్

ఐపీ నెం. 34/2010 TPGSC

Between
Sri Paturi Ramachandra Rao .... Petitioner
and
Gaggara Hareramakrishna & others ..Respondents

వేలం యిస్థిహారు

ఈ క్రింద ఉదహరించు సొత్తులో ఇన్‌సాల్వెంటుకు గల హక్కు బాధ్యత సంబంధమును ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా, అఫిషియల్ రిశీవరు గారు తమ ఆఫీసులో ఏలూరులో ది.12-01-2024 ఉదయం 10-30 గం॥లకు మొదలు బహిరంగముగా వేలంలో విక్రయించుదురు.

వేలము యొక్క నిబంధనలు

1. పాటదారు సర్కారు వారి పాటకంటే ఎక్కువ మొత్తమునకు పాడవలయును. ఎవరు ఎక్కువ మొత్తమునకు అడుగుచున్నారో వారి పక్షమున సాధారణముగా ముగింపు చేయబడును.
2. ఖరీదుదారుడు తన పక్షమున ముగింపు అయిన తక్షణమే నూటికి 25 రూపాయలు చొప్పున పైకము చెల్లించవలయును. మిగిలిన మొత్తమును ఆ తేదీ లగాయితు 15 రోజులలోగా చెల్లించవలయును. ఖరీదుదారుడు మిగిలిన మొత్తమును చెల్లించని పక్షమున తాను చెల్లించిన పైకము ఇన్సాల్వెంట్ యొక్క ఎస్టేటుకు దండుగ క్రింద చేరిపోవును, మరిన్ని పైకము చెల్లించక తప్పిన వారి యొక్క జవాబుదారి పైన నోటీసు లేకుండా సొత్తును మరలా వేలము వేయబడిన అందుమూలముగా సంభవించు, నష్టమునకున్ను, ఖర్చులకును తాను జవాబుదారుడై యుండగలడు. సొమ్ము చెల్లింపక తప్పిన వారికి సొమ్ము యందు గాని, లేక దరిమిలా అమ్మబడిన పైకములో ఏ భాగమందైనను ఎలాంటి బాధ్యతగాని యుండనేరదు.
3. లోపాలోపములకు లోబడియే వేలము జరుపబడుచున్నది. వేలము పాడుటకు ఉద్దేశించువారు సొత్తు పైన ఇందుగల అన్ని తగాయిదాలు విషయమై కావలసిన విచారణలు చేయవలెయును. వారలు వేలంలో పాడుటను బట్టి అన్ని తగాయిదాలు లోపాలోపములు పూర్తిగా తెలిసియే పాడినట్లు యెంచబడును. సొత్తులకు సంబంధించిన దస్తావేజులను వేలము తేదీ ముందు రోజు ఏలూరులో అఫిషియల్ రిశీవరు ఆఫీసులో తనిఖీ చేయవచ్చును.
4. ఎక్కువ పాటను కారణము చెప్పకయే తోసివేయు అధికారము అఫిషియల్ రిశీవరు గారికి కలదు. ఏలూరులో అఫిషియల్ రిశీవరు ఎక్కువ పాటను తొడనే అంగీకరింపవచ్చును. లేక వేలమును వేరొక దినమునకు నిలిపి పెట్టవచ్చును. వేలము ముగింపు చేయుటకు, స్థిరపరచుటయు, అఫిషియల్ రిశీవరు యొక్క ఇష్టముననుసరించి యున్నది.
5. వేలపు తేదీ లగాయితు సొత్తుకు సంబంధించి అన్ని పన్నులు, సెస్సులు ఖరీదుదారుడు చెల్లింపవలెను. కొనుగోలు మొత్తమును యావత్తు చెల్లించి వేలము తన పక్షమున ఖాయపరిచిన గాని అతడు సొత్తులో ప్రవేశింపకూడదు.
6. క్రయదారుడు తన జవాబుదారీ మీదను విక్రయ పత్రము వ్రాయించుకొని రిజిష్టరు చేయించుకొనవలెను.
7. సొత్తులు పదులుగా గాని, లేక లాట్లుగా గాని నోటీసు లేకయే సందర్భాను సారేముగా విక్రయించుటకు అఫిషియల్ రిశీవరు గారి యందు అధికారము ఉంచుకొనబడియున్నది.
8. ఈ క్రింది నిబంధనలు సామాన్యముగా అన్ని వేలములకు వర్తించును. ప్రతిపాటకు కావలసిన యితర విశేషనిబంధనలను వేలం కాలములో గుర్తించబడును.

SCHEDULE : An extent of zeroyat dry land Ac.1-25 cents in RS No.58/2 situated in Kavuluru H/o. Ananthapalli, Ananthapalli Sub Division, Nallajerla Mandal, West Godavari District is bounded by :
East : Land of Bolla Chinnarao and others
South : Kongavarigudem Kaluva
West : Land of Karuturi Ammiraju
North : Land of Karuturi Nirmala
Official Reciver: West Godavari District, ELURU, A.P.

CHANGE OF NAME

I, **NANNETI ANANDA KUMAR** S/o. Nanneti Jayapaul, Residing at DNo. 2-78, Ambedkar Colony, Kummara purugu Palem North, Mogaltur mandal, W.G.Dt. A.P. I have changed my name from **NANNETI ANANDA RAO,** (Old name) to **NANNETI ANANDA KUMAR** (New name) hence forth I am being called **NANNETI ANANDA KUMAR** S/o. Nanneti Jayapaul for all purposes

పాస్‌పోర్టు పోయినది

గణపవరం మండలం, మొయ్యేరు గ్రామమునకు చెందిన కోరం వీరస్వామి, భార్య రిబక అను నేను మొయ్యేరు నుండి గణపవరం వచ్చి నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **H3595332** పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకుని జిరాక్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్టును కవర్లో పెట్టుకుని బండివై గణపవరం నుండి మొయ్యేరు వెళ్లే దారిలో కవర్‌తో సహా మార్గమధ్యలో పడిపోయినది. దారిలో ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కోరం రిబక
భర్త: వీరస్వామి
మొయ్యేరు గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9121971215

ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీ యడ్లపల్లి ప్రభాకరరావు గారి కుమారుడు విజయ్‌కుమార్, బాలాజీపేట, రాజమహేంద్రవరం (రాజమండ్రి), ప్రస్తుతం హైదరాబాద్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు ది. 07-07-2010 సం॥ తేదీన తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని తాళ్ళముదునూరుపాడులో డోర్ నెం. 10-31-4/1, 2 గల రెండు పోర్షన్ల డాబా కలిగిన 150 చ॥గ॥ల స్థలమును దస్తావేజు నెం. 4306/2010 గా గింజాల అప్పారావు గారి వద్ద క్రయం పొందియున్నారు. అదేరోజున నా క్లయింటు వారి యొక్క దస్తావేజు నెం. 4311/1988, తేది. 16-11-1988 ఒరిజినల్ ఇచ్చియున్నారని, దరిమిలా సదరు ఒరిజినల్ దస్తావేజు నెం. 4311/1988 ఒరిజినల్ డిసెంబర్ నెల మొదటి వారంలో తాడేపల్లిగూడెం తాలూకా సెంటర్ వద్ద జిరాక్స్ చేయించుకున్న దర్మిలా తాళ్ళముదునూరుపాడులో గల ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినదని తెలుసుకుని తిరిగి వెనక్కి వెళ్ళి ఎంత వెతికిననూ కనిపించియుండలేదని తెలియజేసినారు. ఈ రోజు వరకు కనిపించలేదని, సదరు దస్తావేజు నెం. 4311/1988 ఎవ్వరికైనా దొరికిన యెడల తిరిగి నా క్లయింటు అడ్రస్సుకు గానీ, నా యొక్క అడ్రస్సుకి గాని ఇవ్వగలరు.

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్, నోటరీ, ఏలూరు
సెల్: 944011033

మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు
O.S. No.187/2023

Between:-
పిల్లం వెంకటేశ్వర రావు ...వాది
మరియు
1)మాగంటి వెంకటలక్ష్మీ
2)జంగలి సత్యవతి
3)మాగంటి రామలక్ష్మీ
4)మద్దుల సునీత ...ప్రతివాదులు

To,
1)మాగంటి వెంకటలక్ష్మీ, భర్త:లేటు బాబురావు, వయస్సు:58 సం॥లు, వృత్తి:గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
2)జంగలి సత్యవతి, భర్త:సురేష్, వయస్సు: 40 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-02, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
3)మాగంటి రామలక్ష్మీ, భర్త:సిద్ధు, వయస్సు:36 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం:ఇంటి నెం.1-01సి, తాటికాకులగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.
4)మద్దుల సునీత, భర్త:శ్రీనివాస్, వయస్సు: 34 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: బండివారిగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా.

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావాపై మీకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో మీరు ది.12-01-2024 తేదీన ఉదయం 10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడుతుందని తెలియజేయడమైనది.

// కోర్టువారి అనుమతితో//

వాయిదా తేదీ:12-01-2024
కొత్తగూడెం,
18-12-2023

ఇట్లు
లక్కినేని సత్యనారాయణ,
న్యాయవాది-కొత్తగూడెం.